# ఆత్మ హత్య



ఆ పదంతస్తుల భవనం నించి క్రింద ఉన్న మనుష్యులు చిన్న చిన్న బొమ్మల్లాగ కనపడ్తున్నారు వెంకటేశుకి. అందరూ తలలు పైకెత్తి ఏదో ప్రక్క వాళ్ళతో చెప్పుకుపోతున్నారు. రిక్షాలు కార్లు ఆపి కొత్త కొత్త వాళ్ళు తనవైపే చూస్తున్నారు. ఆ సందు మొగలో ట్రాఫిక్ అంతా బంద్ అయిపోతోంది. ఆ మనుష్యులు, వాళ్ళ ఆత్రుతం చూస్తే వెంకటేశుకి ఏదో చెప్పరాని ఉత్సాహం కలిగింది.

వాళ్ళంతా తన గురించే మాట్లాడుకుంటున్నారు. తను ఎప్పుడు మేడ మీదనించి కిందికి గెంతుతాడా అని ఆత్రుతతో చూస్తున్నారు. అందులో చాలా మంది ఒక నిండు ప్రాణం తమ కళ్ళముందే పోతుందేమోనని బాధ పడుతూనే ఉంటారు. కాని ఆ బాధ వెనకాల ఏదో చెప్పరాని సరదా ఉండడంవల్లే అందరూ కదలకుండా తెలియని ఉత్సాహంతో చూస్తున్నారు.

వెంకటేశుకి వాళ్ళని చూస్తుంటే ఒక కొత్త ప్రపంచంలో ఉన్నట్టుంది.

వాళ్ళంతా ప్రాణం ఉన్న మనుష్యులు కాని తను ఇప్పుడు ఆత్మహత్య చేసుకోడానికి సిద్ధంగా ఉన్నాడు. వాళ్ళు వేరు తను వేరు అని భావం కలిగినసే వాళ్ళకంటె చాల గొప్పవాడినయ్యాను అని అనుకున్నాడు వెంకటేశం. ఆ భవనం ప్రక్కని పోలీసు ఠాణాలోంచి ఒక ఇన్స్పెక్టర్, నలుగురు పోలీసులు కంగారుగా పరిగెత్తుకుని మేడలోకి వస్తున్నారు.

వెంకటేశుకి సరదా వేసింది. ఇప్పుడు వాళ్ళు తన దగ్గరికి వస్తారు. తనని [illegible]దిస్తారు. బ్రతిమాలతారు. ఆత్మహత్య పాపం అంటారు. నేరం అంటారు. కాని తను మాత్రం తను ఇక్కడికి వచ్చినపని చెయ్యందే కదల కూడదని నిశ్చయించుకున్నాడు.

పోలీసు బలగం అంతా ఆఖరి అంతస్తు చేరింది. కిటికీలోంచి తనను అందుతాడేమో అని చేతులు చాచి ప్రయత్నిస్తున్నారు పోలీసులు. కాని లాభంలేదు. సన్నటి చిన్న వరండాలో రెండు కిటికీలమధ్య తను నిల్చుందికి కాక ప్రయత్నిస్తే ఇంకొక మనిషికి మాత్రం చోటుంటుంది.

పాపం! ఆ ఆఫీసు మేనేజరు వెఱ్ఱి మొహం పెట్టుకుని ఇన్స్పెక్టర్‌కి సంజాయిషీ చెప్పుకుంటున్నాడు. ఆయన వెంకటేశుని ఎప్పుడూ చూడలేదుట వాళ్ళ ఆఫీసులో పనిచేయడట. ఎలా వచ్చాడో కూడా తెలియదట. ఎవరూ చూడకుండావచ్చి వాళ్ళపరువు, ప్రతిష్ట తీయడానికి ఇక్కడ చేరేడు అని గోల పెడుతున్నాడు. ఇన్స్పెక్టరని తోసుకుని ముందుకువచ్చి వెంకటేశుని బతిమాలుకున్నాడు. వెంకటేశుకి ఏం కష్టమున్నా తన చేతిలో ఉన్నదంతా చేస్తానన్నాడు. ఉద్యోగం ఇస్తానన్నాడు. డబ్బు ఇస్తానన్నాడు. ఏమి కావాలన్నా చేస్తానన్నాడు. ఇక్కడ అనవసరంగా చచ్చిపోవద్దు మొర్రో అని బతిమాలుకున్నాడు.


ఇంతలో ఒక పోలీసు తెగించి మెల్లిగా దిగి ఎలాగేనా వెంకటేశుని పట్టుకుని తీసుకువస్తానన్నాడు. కాని వెంకటేశుని ఖచ్చితంగా హెచ్చరించాడు. ఎవరేనా కిటికీలోంచి దిగే ప్రయత్నంచేస్తే, తక్షణం తను ఉరికేస్తానని.

ఎవరికీ ఏమీ తోచటంలేదు. కింద జనం ఎక్కువయిపోతున్నారు. పైన మేనేజరు జుట్టుపీక్కుంటున్నాడు, ఏంబ్యులెన్సు, ఫస్ట్‌ఎయిడు ఏర్పాట్లు జరుగుతున్నాయి,

అంతదాకా మాట్లాడకుండా ఉన్న ఇన్స్పెక్టర్ ముందుకు వచ్చాడు. "చూడు బ్రదర్, ఎందుకొచ్చిన గొడవ ఇదంతా"

"నాకు చావాలనిఉంది. చస్తున్నాను.

వై. లలితా విశ్వనాథ్
బి. ఏ.




నీకు ఎందుకు సంజాయిషీ చెప్పుకోవాలి."

"అదే! అంత చావాలనే అవసరం ఏం వచ్చింది? నీకు పెళ్ళాం, బిడ్డలు, సంసారం ఎవరూ లేరా?"

"ఈవేళ ఎవరూ లేరు.'

ఆ మాట అంటుంటే వెంకటేశుకి పెదాలు వణికాయి. అవును. ఇప్పుడు ఎవరూలేరు. పదిరోజుల క్రితందాకా ఒకే ఒక చెల్లెలుండేది. ఆమెను చదివించాలని, పెద్ద కుటుంబంలో పెళ్ళి చేయాలని తను పది ఏళ్ళుగా ఈ పట్నంలో నానా అవస్థలుపడి సంపాదించి, హాస్టలులోఉన్న చెల్లెలుకి పంపించేవాడు. వారం రోజుల క్రితం ఆ చెల్లెలు దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

"అన్నయ్యా, నువ్వునామీద అనేక ఆశలు పెట్టుకున్నావు. కాని నేను నిర్భాగ్యురాలిని. నువ్వు రెక్కలకష్టం మీద సంపాదించి పంపిన డబ్బుతో జాగ్రత్తగా చదువుకుంటూ ఉంటే నాకెంతో హాయిగా ఉండేది. కాని నా ఖర్మ వశాత్తు ఒకరిచే వంచింపబడ్డాను. చిన్నతనం నించి నేను తల్లి దండ్రుల నెరుగను. నువ్వేనాకన్నీ అయినప్పుడు ఈ విషయం నీ దగ్గర చెప్పకుండా చావలేను. నన్ను ఎవరు మోసగించేరో ఆయన నెలరోజుల క్రితం నీవు ఉన్న ఊరికే బదిలీఅయి వచ్చారు. నేను

గర్భవతినై, ఆయన్ని వెతుక్కుంటూ మీ ఊరు చేరుకునే సరికి, ఆయన వివాహితుడు, ఇద్దరు పిల్లల తండ్రి అని తెలిసినది. ఇందులో ఎవరిని నిందించి ఏమి లాభం? ఈ ఉత్తరం నీకు అందేసరికి నేను ప్రాణాలతో ఉండను. ఆయన పేరు .......... ఉద్యోగము ........ ఎడ్రసు ........"

ఇట్లు అభాగిని,
నీ చెల్లెలు శాంత."

ఈ ఆలోచనల్లో వెంకటేశుకి తల తిరిగినట్టయింది. ఆ ఇన్స్పెక్టర్ మెల్లగా సిగరెట్టు కాలుస్తూ వెంకటేశుని గమనిస్తున్నాడు.

"చూడు అబ్బాయి, నా మాటవిని ఒక పని చెయ్యి. ఈ క్రింది జనాన్ని చూడు. వాళ్ళంతా ఎందుకు నిలబడ్డారనుకుంటున్నావు? నువ్వు కిందకి గెంతి చస్తే చూసి ఆనందిద్దామనుకుంటున్నారు. ఆ వెధవ లందర్నీ సంతోషపెట్టడానికా నువ్వు ప్రాణం తీసుకునేది? నా మాట విని లోపలికొచ్చెయ్యి. ఇంతసేపూ సరదాగా కనిపెట్టుకున్న వీళ్ళంతా వెర్రి మొహాలేస్తారు. వీళ్ళని ఏడిపించడానికేనా ఈ మాటుకి లోపల కొచ్చెయ్యి. ఏమంటావు?"

"అంతేనంటారా? చూడండి! ఎంత మంది జనం పోగయ్యేరో. మీరు చెప్పింది నిజమే! అందర్నీ ప్రాణాలు తీసుకునేదాకా కష్టపెట్టే వాళ్ళు వీళ్ళే. ఆ మనిషి చస్తూంటే చూసి సంతోషించే వాళ్ళు వీళ్ళే. అందుకని నేను చావదలుచుకోలేదు."

"అది. అలా వుండాలి. మరి పైకిరా."

"కొద్దిగా కళ్ళు తిరుగుతున్నాయి. కొంచెం చెయ్యి అందించండి."

మెల్లగా ఇన్స్పెక్టర్ కిటికీలోంచి దిగాడు. ఇన్స్పెక్టర్ జాగ్రత్తగా మాట్లాడి, ఈ మనిషిని రక్షించాడని జనం చప్పట్లు కొడుతున్నారు. పేపరు వాళ్ళు కెమేరాలు నొక్కుతున్నారు. ధైర్యసాహసాలకి ప్రెసిడెంటు మెడల్ తనకి అప్పుడే వచ్చినట్టు ఇన్స్పెక్టర్ గర్వంగాపోజు పెడుతున్నాడు.

ఇన్స్పెక్టర్ వెంకటేశు చెయ్యి పట్టుకున్నాడు. వెంకటేశు గట్టిగా పిడికిలి బిగించాడు.

"ఇన్స్పెక్టర్ శేఖరంగారూ, నా పేరు వెంకటేశు. వారం రోజులక్రితం ఆత్మహత్య చేసుకున్న శాంత నా చెల్లెలు."

ఇన్స్పెక్టర్ నిర్ఘాంతపోయి చెయ్యి విదిలించుకోబోయాడు. కాని ఆ పది అంగుళుల ఎత్తులో నించి కింద పడే దాకా అతనికి తెలిసినది తనతోపాటు ఉన్న వెంకటేశు ....... అతని గట్టి పిడికిలి.

(ఒక ఇంగ్లీషు కథ ఆధారంగా)

***